# యూరియా కోసం రైతుల పడిగాపులు


కోరుట్లరూరల్ : మాదాపూర్‌లోని సహకార సంఘం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

ధర్మపురి/ కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 20: యాసంగి పూట యూరియా కష్టాలు తీవ్రమయ్యాయి. రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం.. అధికారుల పట్టింపులేమితో సొసైటీల వద్ద రోజంతా పడిగాపులు పడుతున్నా ఒక్క బస్తా దొరకడం లేదు. ఇందుకు జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన, కోరుట్ల మాదాపూర్ సహకార సంఘాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ధర్మపురి మండలం జైన సహకార పరపతి సంఘం గోదాముకు వారం రోజులుగా యూరియా రావడం లేదు. గురువారం 340 బస్తాల లోడ్ వచ్చినా 25శాతం రైతులకు కూడా సరిపోలేదు. యూరియా పంపిణీ టైంలో రైతులు ఎగబడ్డారు. అధికారులు పోలీసుల సాయంతో పంపిణీ చేయాల్సి వచ్చింది. అందరికీ అందకపోవడంతో రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే పలుకుబడి ఉన్నోళ్లకే బస్తాలు ఇస్తున్నారని, ఇదెక్కడి పద్ధతి అంటూ పలువురు రైతులు హమాలీలతో గొడవకు దిగారు. ఇక కోరుట్ల మండలం మా దాపూర్‌లోని ప్రాథమిక సహకార సంఘ కార్యాల యం వద్ద యూరియా కోసం పెద్ద సంఖ్యలో రైతులు బారులు తీరారు. పట్టా పాసు పుస్తకాలతో సహకార సంఘం వద్ద టోకెన్ల కోసం క్యూలైన్ కట్టారు. రోజంతా పడిగాపులు కాసినా కొందరికే యూరియా అందడంతో మిగిలిన వారు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు పూర్తిస్థాయిలో స్టాక్ తెప్పించకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు.


ధర్మపురి: జైన సహకార సంఘం ఎదుట..

# పాడిరైతు కన్నెర్ర

## సిరిసిల్లలో డెయిరీ చిల్లింగ్ సెంటర్ సీజ్‌పై రైతుల ఆగ్రహజ్వాల

- పాల సేకరణ నిలిచిపోవడంపై ఎక్కడికక్కడ ఆందోళన
- పాల కేంద్రాల ఎదుట, రోడ్లపై బైఠాయించి నిరసనలు
- రోడ్లపై పాలు పారబోసి ఆగ్రహం
- తమపై కక్ష చూపొద్దని వేడుకోలు
- సెంటర్‌ను తెరిపించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక
- ఎట్టకేలకు దిగొచ్చిన అధికారులు
- రాత్రి పూట తెరుచుకున్న సెంటర్


సిరిసిల్ల-కరీంనగర్ రహదారిపై ధర్నా చేస్తున్న పాడిరైతులు


రోడ్డుపై పాలను పారబోస్తున్న రైతు


గంభీరావుపేట: పాల క్యాన్లతో రోడ్డుపై ధర్నా చేస్తున్న పాడి రైతులు


రోడ్డుపై బైఠాయించిన రైతులను తీసుకెళ్తున్న పోలీసులు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ)/ కోనరావుపేట/ గంభీరావుపేట/ ఎల్లారెడ్డిపేట: పాడి రైతులు కన్నెర్రజేశారు. అగ్రహారంలోని కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ పాల శీతలీకరణ కేంద్రాన్ని సీజ్ చేయడంపై భగ్గుమన్నారు. గురువారం సాయంత్రం సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా పాలసేకరణ నిలిచిపోగా, రైతులు ఎక్కడికక్కడ రోడ్డెక్కారు. సెంట్లర ముందు, రోడ్లపై పాల డబ్బాలతో బైఠాయించారు. తమ పాలను కరీంనగర్ డెయిరీలో పోస్తామని, తీసుకునే వరకు రోడ్డుపై నుంచి లేచేది లేదంటూ అక్కడే బైఠాయించారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి, కోనరావుపేట, మల్కపేట, కనగర్తి, ధర్మారం, నిజామాబాద్, వేములవాడ రూరల్ మండలం అనుపురం, ఇల్లంతకుంట మండలంలోని రేపాక, సోమారంపేట గ్రామాలతోపాటు గంభీరావుపేట మండలకేంద్రంలో పాలను పారబోసి నిరసన తెలిపారు. అంతటా అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినదించారు. 145 గ్రామాల్లోని సుమారు 20వేల మంది పాడి రైతులకు అండగా ఉంటున్న మిల్క్ చిల్లింగ్ కేంద్రాన్ని ఎలాంటి నోటీస్ ఇవ్వకుండానే సీజ్ చేయడం సరికాదని ధ్వజమెత్తారు. 20 ఏండ్ల నుంచి రైతుల భాగస్వామ్యంతో నడుస్తున్న సెంటర్‌ను సీజ్ చేసిన పాపం ఊరికేపోదని నిప్పులు చెరిగారు. 35వేల లీటర్ల పాలను సేకరించే చిల్లింగ్ సెంటర్‌ను సీజ్ చేసి తమ ఉపాధిని దెబ్బతీశారంటూ నిప్పులు చెరిగారు. ప్రభుత్వం, అధికారయంత్రాంగం అనుసరిస్తున్న కక్షసాధింపు చర్యలకు ఇది నిదర్శంగా నిలుస్తున్నదని మండిపడ్డారు. తమపై ఇలా ప్రతాపం చూపడం సరి కాదని, వేలాది కుటుంబాలకు అండగా ఉంటున్న కేంద్రానికి చేయూతనివ్వాల్సింది పోయి ఇలా వ్యవహరించడం ఎంతమాత్రం మంచిది కాదని సూచిస్తున్నారు. అధికార పార్టీ కనుసన్నల్లోనే అధికారులు ఈ పాపానికి ఒడిగట్టారన్న ఆరోపిస్తున్నారు. నిజంగానే కేంద్రానికి ఏవైనా అనుమతులు లేకపోతే నోటీసులు ఇచ్చి డెయిరీ నిర్వాహకులకు సమయం ఇవ్వాలని, స్పందించని పక్షంలో చర్యలు తీసుకోవాలే తప్ప ఇలా ఎకాఎకిన సీజ్ ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. చిల్లింగ్ కేంద్రం సీజ్‌వల్ల వేలాది మంది రైతులు రోడ్డున పడే పరిస్థితి వచ్చినా అధికార పార్టీ నాయకులు కనీసం నోరెత్తకపోవడంపై ఆగ్రహిస్తున్నారు. పాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న తమపై ప్రభుత్వం కర్కశత్వంగా వ్యవహరిస్తున్నదని మండిపడుతున్నారు. సీజ్ చేసిన సెంటర్‌ను వెంటనే తెరిపించాలని, లేని పక్షంలో ప్రతి గ్రామంలోని రైతులందరం కలిసి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### పాడిరైతుల పొట్టకొట్టింది



నేను పదిహేనేండ్ల సంది కరీంనగర్ పాల డెయిరీ పాలకేంద్రంల పాలుపోస్తున్న. నాకు రోజుకు సుమారు రూ.వంద వస్తయ్. ఇన్నేండ్ల చరిత్రల ఇప్పటివరకు ఎప్పుడూ పాలు బయట అమ్ముకోలే. నాకు తెలిసి మొదటిసారి కేంద్రానికి పాలు తీసుకువచ్చి తిరిగి ఇంటికి తీసుకుపోతున్న. మాలాంటి రైతుల పొట్టకొట్టడం తప్ప ఈ ప్రభుత్వానికి తెలిసింది మరొకటి లేదు. ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తంది తప్ప ఎక్కడా మేలు చేసింది లేదు.

-మోకిడె మైసయ్య, పాడిరైతు, మామిడిపల్లి (కోనరావుపేట)

### కక్షసాధింపు మానుకోవాలి



నేను పాలను కేంద్రంలో అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న. డెయిరీ వాళ్లు కూడా టైంకు డబ్బులు ఇస్తున్నరు. కానీ, కరీంనగర్ డెయిరీ సీజ్ చేసి మా పొట్ట కొట్టిన్రు. ప్రభుత్వం ఏదైనా సమస్య ఉంటే వారు వారు చూసుకోవాలి. ఇలా డెయిరీ సీజ్ చేసి పాల రైతుల పొట్టకొట్టడం సరికాదు. ఇప్పటికైనా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి.

- తాళ్లపల్లి పాపయ్య, పాడిరైతు, ధర్మారం (కోనరావుపేట)

### కక్షపూరిత చర్యలు వద్దు



కరీంనగర్ డెయిరీలో పాలు పోస్తున్న పాడి రైతులకు ఎన్నో రకాల సేవలు అందిస్తూ డెయిరీ అండగా నిలుస్తున్నది. పాడి రైతు కుటుంబాల పిల్లల చదువుల కోసం స్కాలర్‌షిప్‌లు, ఫలితాలపై ప్రోత్సాహక ఆర్థికసాయం, వృద్ధులకు పింఛన్లు, ఆడబిడ్డల పెళ్లిళ్లకు పుస్తె మట్టెలు, పాడి గేదెల అభివృద్ధికి రాయితీ రుణాలు, గడ్డి పెంపకం, రాయతీపై పశువులకు దాణా, సంపూర్ణ ఆరోగ్యానికి అత్యవసర వైద్యసేవలను అందిస్తున్నది. విక్రయిస్తున్న పాలకు సరసమైన ధరను కూడా ఇస్తున్నది. ఇంత మంచిగా సేవలందిస్తున్న డెయిరీని మూసేయడం దారుణం. విజయ డెయిరీలో మేం పాలు పోయనే పోయం. మీరు పాలు పోయాలని చెప్పడం సిగ్గు చేటు. రైతులపై కక్షపూరిత చర్యలు వద్దు. మా పొట్ట కొట్టద్దు. ఇలానే చేస్తూ పోతే మేం ఊరుకోం.

- నల్ల రాజ్‌కుమార్, పాడి రైతు (గంభీరావుపేట)


వేములవాడ రూరల్: అనుపురంలో రోడ్డుపై పాలను పారపోస్తున్న రైతులు

## రోడ్డెక్కి.. నిలదీసి

- అగ్రహారంలో మూడు గంటలపాటు రైతుల ధర్నా
- అర కిలోమీటర్ మేర నిలిచిన వాహనాలు
- విజయ డెయిరీకి పోయండని చెప్పిన ఆర్డీవో రాజేశ్వర్ సలహా
- పాడి రైతుల ఫైర్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 20: కరీంనగర్ డెయిరీ పాల శీతలీకరణ కేంద్రాన్ని సీజ్ చేయడంపై దాదాపు 200 మంది రైతులు భగ్గుమన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అగ్రహారానికి చేరుకొని, పాల కేంద్రం ఎదుట సిరిసిల్ల-కరీంనగర్ రహదారిపై ఆందోళన చేశారు. అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినదించారు. దాదాపు మూడు గంటలపాటు ధర్నా చేశారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, డీఆర్డీఏ శేషాద్రి అక్కడి చేరుకోగా, సముదాయించే ప్రయత్నం చేశారు. దీంతో రైతులు మరింత కోపోద్రిక్తులయ్యారు. ఎటువంటి నోటీస్ ఇవ్వకుండానే ఎలా సీజ్ చేస్తారని, తాము ఎక్కడ పాలు పోయాలంటూ మహిళా రైతులు ప్రశ్నించారు. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని, విజయ డెయిరీకి పోయాలని ఆర్డీవో రాజేశ్వర్ సూచించగా, రైతులు మండిపడ్డారు. తామెందుకు విజయడెయిరీకి పోయాలని నిలదీశారు. బయట పారబోయనైనా పోస్తాం గానీ, విజయ డెయిరీకి పోసేది లేదని తేల్చిచెప్పారు. కావాలనే రాజకీయ కక్షతో అధికారులు తమ పాలకేంద్రాన్ని సీజ్ చేశారని, నోటీసులు ఇవ్వకుండా ఎలా మూసివేస్తారని ప్రశ్నించగా, ఏం సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు. రైతులు అడిగిన ఏ ఒక్క ప్రశ్నకూ సమాధానం చెప్పలేకపోయారు. అయితే మూడు గంటలపాటు ధర్నా చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో కలెక్టర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అయితే అరకిలోమీటర్ మేర వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగడంతో పోలీసులు బలవంతంగా రైతులను పక్కకు ఈడ్చుకెళ్లారు. రోడ్డుపక్కకు తోసివేశారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ధర్నా అనంతరం ఆర్డీవో పాటు సీఐలు, ఎస్ఐలు అక్కడి నుంచి వెళ్లిపోగా, పోలీసులు కొంత మంది అక్కడే ఉన్నారు. పాలకేంద్రం వద్దకు ఎవరూ రాకుండా బందోబస్తు నిర్వహించారు.


విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో సీల్‌ను తొలగిస్తున్న అధికారులు


కోనరావుపేట: కనగర్తిలో పాలకేంద్రం ఎదుట పాల డబ్బాలతో నిరసన తెలుపుతున్న రైతులు

## రైతుల పోరాటం సెంటర్ ఓపెన్

అగ్రహారంలో రైతులు మూడుగంటల పాటు ఆందోళన చేయగా, పోలీసులను పెట్టి విరమింపజేశారు. కానీ, సాయంత్రం పాలకేంద్రాల వద్ద మెజార్టీ గ్రామాల రైతులు ఆందోళనతో హోరెత్తించారు. ప్రభుత్వం, అధికారులతోపాటు కలెక్టర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అలాగే శుక్రవారం ఆందోళన మరింత తీవ్రం చేయాలని, కలెక్టరేట్‌ను ముట్టడించాలని నిర్ణయించారు. ఆ మేరకు అన్నీ పాడి సహకార సంఘాలకు సమచారం ఇచ్చారు. సీజ్ చేసిన చిల్లింగ్ సెంటర్‌ను తెరిచే వరకు కలెక్టరేట్ నుంచి కదలొద్దని నిర్ణయం తీసుకున్నారు. రైతుల ఆందోళన ఉగ్రరూపం దాలుస్తుందన్న విషయం తెలియడంతో అధికారులు దిగొచ్చారు. అధికార పార్టీ నాయకులు.. కలెక్టర్‌తో మాట్లాడగా, రాత్రి తొమ్మిది గంటల సమయంలో ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ సమక్షంలో పంచాయతీ కార్యదర్శి సీజ్‌ను తొలగించి, చిల్లింగ్ సెంటర్‌ను ఓపెన్ చేశారు అయితే రైతుల ఆందోళన తీవ్రమైతే ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తెస్తుందన్న భయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇది ఇలాగే కొనసాగిస్తారా.. లేక రైతుల ఉద్యమం చల్లారగానే, మళ్లీ సీజ్ చేస్తారా..? అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి.

### రోడ్డున పడేయద్దు



ఇప్పుడు డెయిరీ శీతలీకరణ కేంద్రాన్ని సీజ్ చేస్తే ఎలా? విజయ డెయిరీలో పాలు అమ్ముకోవాలని చెబితే ఎట్లా? మేం కొన్నేండ్ల సంది మేం కరీంనగర్‌లో డెయిరీలో పాలు పోస్తున్నం. ఇప్పుడు ఆ కేంద్రాన్ని సీజ్ చేసి పాడి రైతులను రోడ్డున పడేసింది. ఇది సరి కాదు. ఇట్లయితే ప్రభుత్వానికి మేం తగిన గుణపాఠం చెబుతం.

- గంట శ్రీనివాస్. పాడి రైతు (గంభీరావుపేట)



ఇల్లంతకుంట: రేపాకలో నిరసన తెలుపుతున్న రైతులు

### ఇట్ల బంజేసుడేంది?



నేను కొన్నేండ్ల నుంచి పాలమ్ముతున్న. ఎప్పుడే గిట్లగాలె. రోజు పొద్దుగాల రెండు లీటర్లు.. మాపటీలు రెండు లీటర్లు పాలమ్ముత. ఇప్పుడు ఈడికి రాంగనే పాలు కొనుడు బంజేసినం అంటున్నరు. కలెక్టర్ అగ్రహారంల పాల కేంద్రాన్ని మూయించిండని చెపుతున్నరు. మా రైతుల కోసం పాల కేంద్రం ఉన్నది. దీన్ని ఇట్ల బంజేసుడేంది అర్థమైతలేదు. పొద్దుగాల ఏడికి రమ్మంటే ఆడికి పోతం అడుగుతం ఇట్లెందుకు జేసిన్రని.

- ఎర్రభూమి దేవయ్య, పాడి రైతు (ఎల్లారెడ్డిపేట)

### రైతుల మీద ప్రతాపం చూపొద్దు



కరువు కాలంలో పాలమీద బతుకుతున్నం. పాడి రైతుల బతుకుదెరువుకు దెబ్బతీస్తే ఊరుకునేదిలేదు. పాల కేంద్రాలు వెంటనే షురూ చేయాలి. రైతుల పొట్టమీదకొడితే ఏం వస్తది. కాయకష్టం చేసి పాలు అమ్ముకునే రైతుమీద ప్రతాపం చూపొద్దు. ప్రభుత్వం స్పందించి వెంటనే పాలు కొనాలి.

-వరి లక్ష్మణ్, పాడి రైతు (పోతుగల్)

### మా మీద కోపం వద్దు



మేం కొన్నేండ్లుగా కేంద్రంల పాలు పోస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నం. ఇప్పటికే మేం వేసిన పంటలు పండుతాయా.. లేదా? అని రోజూ బోరుబావుల వద్ద కాచుక కూర్చుంటున్నం. ఇప్పుడు పాలమీద బతుకుతున్న నాలాంటి పేద రైతులు పొట్టకొట్టే పనులు చేస్తున్నరు. అధికారులు మా రైతుల బతుకుల మీద కోపాన్ని చూపొద్దు. వెంటనే పాల సేకరణ జరపకుంటే పెద్ద ఎత్తున నిరసనలు చేస్తం.

- జ్వాల బిక్షపతి, పాడి రైతు (ముస్తాబాద్)

## పోలింగ్ సామగ్రి పంపిణీ వేర్వేరుగా చేపట్టాలి

### రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : ఉత్తర తెలంగాణ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయుల శాసనమండలి స్థానాలకు నిర్వహించనున్న ఎన్నికల పోలింగ్ సామగ్రిని వేర్వేరుగా పంపిణీ చేయాలని రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి సూచించారు. నగరంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల బ్యాలెట్ బాక్సుల ఏర్పాటు, వాటి విభజన స్పష్టంగా ఉండాలన్నారు. పోలింగ్ బందోబస్తు, బారికేడ్ల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూమ్, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లపై పోలీసు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని వైపులా సీసీ కెమెరాలు అమర్చాలని, 24 గంటల పాటు ఫైరింజన్ అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలకు పంపే ప్రతి బ్యాలెట్ బాక్సును క్షుణ్ణంగా తనిఖీ చేసి లాక్‌సిస్టాన్ని సరిచూసుకోవాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో కే మహేశ్వర్, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు లేవు.. నీళ్లు రావు

- రైతులను అరిగోస పెడుతున్న సర్కారు
- జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, ఫిబ్రవరి 20 : సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచకుండా, సాగునీరు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతున్నదని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మండిపడ్డారు. కేసీఆర్ మీద కోపం రైతులపై చూపవద్దని, దయచేసి ఎరువులు, నీళ్లు అందించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. జగిత్యాలలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ హయాంలో సకాలంలో విత్తనాలు, ఎరువులు, నీళ్లు, కరంట్ అందజేశామని గుర్తు చేశారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తె గోస పడుతామని గతంలో జగిత్యాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమావేశంలో కేసీఆర్ చెప్పారని, ఇప్పుడు రుణమాఫీ కాక, రైతు భరోసా అందక, పంటలు ఎండిపోయి రైతులు నరకం అనుభవిస్తున్న ఘటనలు ఉమ్మడి సారంగాపూర్ మండలంలో ప్రత్యక్షంగా చూస్తున్నామని తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లి, తాటిపెల్లిలో తూములు ధ్వంసమై నీళ్లు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపై రాష్ట్రంలోగానీ, జిల్లాలోగానీ ఇంత వరకు ఒక సమీక్ష జరిగిన పాపాన పోలేదని, యూరియా నిల్వాలు లేవని, పీఏసీఎస్ సంఘం యూరియా కోసం డబ్బులు కట్టినా మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటి వరకు బస్తాలు రావడం లేదన్నారు. మార్పు అంటే ఇదేనా..? అని ఎద్దేవా చేశారు. రైతులు ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్‌కు చీమ కుట్టినట్టు కూడా లేదని ధ్వజమెత్తారు. ఈ పద్ధతి ప్రభుత్వానికి ఎంతమాత్రం మంచిది కాదని హితవు పలికారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జగిత్యాల పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, ప్రధాన కార్యదర్శి అల్లాల ఆనందరావు, సింగిల్ విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్ రావు, గంగారెడ్డి, కల్లూరి హరీశ్, ఆదిరెడ్డి, కమలాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత